

'లోవ'లో శ్రావణ శోభ - 5లో
మరిడమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు - 5లో
సాధారణ స్థాయికి గోదావరి ప్రవాహం

జైలు పక్షుల.. కలత తీరేనా!



- స్వాతంత్ర్య దినోత్సవంపై ఆశలు
- 2019లో చంద్రబాబు హామీ
- ఈ సారి నెరవేరుస్తారని ఆశ
- సెంట్రల్ జైలు ఖైదీలు 1250
- 66 మందికి అవకాశం
- జైలు అధికారుల నివేదిక
- కూటమి నిర్ణయమే తరువాయి
- నాడు క్షమాభిక్ష పెట్టని జగన్
- ఐదేళ్లూ ఖైదీలకు అన్యాయం



• సత్ప్రవర్తనతో ఉన్న ఖైదీలకు క్షమాభిక్షను దూరం చేయడం ఏమాత్రమూ సబబు కాదు. మంచి ప్రవర్తనతో ఉన్నవారికి మరోసారి బాగా జీవించే అవకాశం కల్పించడం సరైన నిర్ణయమే •
- దేశ సర్వోన్నత న్యాయస్థానం.

క్షమాభిక్షకు ఎదురుచూపులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సత్ప్రవర్తన కలిగిన ఖైదీల క్షమాభిక్ష విషయంలో గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర మనోవేదన మిగిలింది. రాజకీయ కక్ష సాధింపుతోనే జగన్ ఐదేళ్ల పాలన సరిపెట్టారు. వైసీపీ పాలకులు కనికరం చూపకపోవడంతో నిరాశ నిండిన గుండెలతో కన్నీటిని దిగమింగుకుంటూ..ఇటు ఖైదీలు.. అటు వారి కుటుంబం తీవ్ర మానసిక ఒత్తిడిలో మునిగిపోయేవారు. ఖైదీల పిల్లల ఆవేదన అయితే మాటల్లో వర్ణించలేం. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం రావడంతో మళ్లీ తమకు ఏ ఇబ్బందులూ లేకుండా క్షమాభిక్ష జీవోలు క్రమం తప్పకుండా వస్తాయని ఖైదీల్లో ఆనందం వ్యక్తమవుతోంది.ఈ స్వాతంత్ర్య దినోత్సవం రోజున విడుదలకు ఆశగా ఎదురు చూస్తున్నారు.

2019లో చంద్రబాబు హామీ ఇచ్చినా..

2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో ఇబ్బంది లేకుండా క్షమాభిక్ష జీవోలు సమయానుకూలంగా జారీ అయ్యేవి. వీటికి రాజకీయ లబ్ధితో లింకు ఉండేది కాదు. అప్పట్లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఆస్పత్రి శంకుస్థాపనకు సీఎం హోదాలో చంద్రబాబు వచ్చినప్పుడు.. 'మీరు మంచిగా మారండి. బయటకు వెళ్లిన తర్వాత మీ కుటుంబాలతో గౌరవంగా, సంతోషంగా బతకాలి. మళ్లీ నేరాలు చేయకూడదు. క్షమాభిక్ష జీవోలకు ఒత్తిడి పడొద్దు. నేనున్నాను. వాటి సంగతి నేను చూసుకుంటాను' అని హామీ ఇచ్చారు. అయితే విధి దగా చేసింది. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చింది. దీంతో చంద్రబాబుకు క్షమాభిక్ష పెట్టే అవకాశం లేకుండా పోయింది. అయినా చంద్రబాబు గతేడాది రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్నప్పుడు తమ గోడు వినిపించుకోడానికి ఖైదీలు ప్రయత్నించినా కుదరలేదు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఒక్కసారి మాత్రమే జీవో ఇచ్చారు. దీనికీ మెలిక పెట్టడంతో చాలా మంది ఖైదీలకు అన్యాయం జరిగింది. జైలు అధికారులు ఎంతో ప్రయాసపడి వేగంగా ప్రక్రియ పూర్తి చేసి జాబితా పంపించినా హైపవర్ కమిటీ, ప్రభుత్వం వద్ద నెలల తరబడి తాత్సారం చేయడం జరిగేది. సుప్రీం కోర్టు నిర్దేశాలపై సైతం పట్టింపు లేకుండా వ్యవహరించారు.ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా గతేడాది రెండు ఫేజుల్లో విడుదల కావాల్సిన జాబితా పెండింగ్‌లోనే ఉంది.మొదటి ఫేజ్‌లో 141, రెండో ఫేజ్‌లో 29 మందితో కూడిన జాబితాను జైళ్ల అధికారులు ఉన్నతాధికారులకు పంపించి నెలలు గడుస్తున్నా ఇంకా నిర్ణయం వెలువడలేదు. ఈలోపు కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో చంద్రబాబు ఆనాటి హామీని ఖైదీలు గుర్తుచేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జైళ్లలో ఉన్న ఖైదీలు ఆగస్టు 15వ తేదీకి విడుదలయ్యేలా జీవో వస్తుందని ఎదురుచూస్తున్నారు.

సెంట్రల్ జైలులో 66 మంది..

ఈ స్వాతంత్ర్య దినోత్సవానికి విడుదల చేయడానికి వీలుగా కూటమి ప్రభుత్వం జీవో ఇస్తే రాష్ట్రంలోని రాజ మహేంద్రవరం,విశాఖపట్నం, కడప, నెల్లూరు సెంట్రల్ జైళ్లతో పాటు వివిధ కారాగారాల్లో శిక్ష అనుభవిస్తున్న మొత్తం 170 మంది ఖైదీలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటూ కుటుంబాల చెంతకు చేరుతారు.వీరిలో మహిళా ఖైదీలు ఉన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ప్రస్తుతం 1250 మంది ఖైదీలు ఉన్నారు. వీరిలో 450 మంది జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. క్షమాభిక్షకు 44 మంది ఎదురు చూస్తున్నారు. మహిళా ప్రత్యేక జైలులో 80 మంది ఖైదీలు ఉండగా 22 మంది క్షమాభిక్ష జాబితాలో ఉన్నారు. ప్రభుత్వం జీవో ఇస్తే స్వాతంత్ర్య దినోత్సవానికి రెండు జైళ్లలో కలిపి 66 మంది స్వేచ్ఛా వాయువులు పీల్చుకోనున్నారు. సోమవారం హోం మంత్రి వంగలపూడి అనిత మహిళా ప్రత్యేక జైలును సందర్శించనున్నారు. సుప్రీంకోర్టు నిర్దేశాల ప్రకారం ప్రత్యేక రోజులతో సంబంధం లేకుండా క్షమా భిక్షపై విడుదల చేయవచ్చు.కానీ గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవాలు,గాంధీ జయంతికి విడుదల చేయడం సంప్రదాయంగా వస్తోంది.

క్షమాభిక్షలోనూ జగన్ మెలిక

టీడీపీ ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు క్షమాభిక్ష జీవోలు జారీ అయ్యేవి. కనీసం రెండేళ్లకు ఒకసారైనా పెద్ద సంఖ్యలో ఖైదీలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేవారు. తమ కుటుంబాల చెంతకు చేరి కొత్త జీవితం ప్రారంభించేవాళ్లు. కానీ జగన్ ప్రభుత్వంలో ఎదురుచూపులతో మగ్గిపోయారు. ఐదేళ్లలో ఒక్కసారి మాత్రమే క్షమాభిక్షపై ఖైదీల విడుదల జరిగింది. అప్పుడు రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలు,మహిళా ప్రత్యేక జైలులో కలుపుకొని సుమారు 60 మందికిపైగా ఖైదీలు బయటకు వెళ్లారు. దానిలోనూ ఖైదీలకు అన్యాయమే జరిగింది. 2021లో విడుదలకు సుముఖత వ్యక్తం చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది.కానీ ఖైదీలను వెంటనే విడుదల చేయలేదు. ఏడాది ఆలస్యంగా ఆగస్టు 15న 2022లో వదిలారు. మరో అన్యాయం ఏమిటంటే..2022లో వదిలిన ఖైదీలకు 2021ని కటాఫ్‌గా తీసుకున్నారు. అలా కాకుండా 2022 కటాఫ్‌గా తీసుకుంటే మరికొంత మంది తమ కుటుంబాల చెంతకు చేరేవారు. దీంతో ఆ ఖైదీలు వైసీపీ ప్రభుత్వం వల్ల ఏడాది శిక్ష అదనంగా అనుభవించాల్సి వచ్చింది.

కుటుంబంపై ప్రతికూల ప్రభావం

సాధారణ జీవిత ఖైదీలకు 7 ఏళ్ల శిక్ష, మూడేళ్ల రెమిషన్‌తో కలుపుకొని పదేళ్లు, 498(ఏ), డెకాయిటీ, దొంగతనాలు వంటి తీవ్రమైన నేరాల్లో 14+6, మహిళలకు 3+2, 65 ఏళ్లు దాటిన వాళ్లకు ఐదేళ్ల శిక్ష, రెండేళ్ల రెమిషన్‌తో ఏడేళ్లు శిక్ష పూర్తి చేస్తే క్షమాభిక్షకు అర్హులవుతారు.ఇంకా కొన్ని నిబంధనలకు లోబడి ఉండాల్సి ఉంటుంది. జైలులో 15 ఏళ్లకు పైబడి శిక్ష అనుభవిస్తున్నవాళ్లు, రెమిషన్(సత్ప్రవర్తనకు కల్పించే ఉపశమనం)తో కలుపుకొని 20 ఏళ్లు దాటిపోయిన ఖైదీలు, 65 ఏళ్లు నిండిన వృద్ధులు ఉన్నారు. క్షమాభిక్ష జీవోల జారీపై తీవ్ర నిర్లక్ష్యంతో సుప్రీం, సామాజిక నిపుణుల ఉద్దేశం సైతం నీరుగారిపోతోంది. కుటుంబాలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ఆర్థిక, కుటుంబ పరిస్థితులు, ఖైదీ సత్ప్రవర్తన ప్రధానంగా దృష్టిలో ఉంచుకొని క్షమాభిక్ష ప్రసాదించాలని కోరుతున్నారు.

ఏడాదికి మూడు సార్లు

సుప్రీం ఆదేశాలతో సమయానుగుణంగా నిబంధనలను అనుసరించి విడుదల చేయాల్సి ఉంటుంది. ఏడాదికి మూడుసార్లు క్షమాభిక్ష ప్రసాదించాలి. మొదటి ఫేజుకు జూన్ 1,రెండో ఫేజుకు అక్టోబరు 1, మూడో ఫేజుకు ఫిబ్రవరి 1 కటాఫ్ తేదీలుగా జీవోలో పేర్కొన్నారు. నాలుగు దశల్లో ప్రక్రియ పూర్తిచేయాలి.ఫేజ్1లో భాగంగా జనవరి 1 నుంచి 15వ తేదీలోపుగా,ఫేజ్ 2లో మే 1 నుంచి 15వ తేదీలోగా, ఫేజ్ 3లో సెప్టెంబరు 1 నుంచి 15వ తేదీలోగా అర్హులైన ఖైదీలను గుర్తించాల్సి ఉంటుంది. ఆపై జైలు అధికారులు మూడు నెలల్లోగా సంబంధిత పత్రాలు సిద్ధం చేసుకోవాలి. జైలు అధికారులు ప్రిజన్స్ డైరెక్టర్ జనరల్‌కి సిఫారసు చేసిన తర్వాత మూడు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక అందాలి. అనంతరం మూడు నెలల్లో ప్రభుత్వ నిర్ణయం వెలువడాల్సి ఉంటుంది. అంటే ఫేజ్ 1కి అక్టోబరు 1, ఫేజ్2కి ఫిబ్రవరి 1, ఫేజ్3కి జూన్ 1లోగా ప్రభుత్వం జీవో విడుదల చేయాలి.

ఆర్డర్ వస్తే.. విడుదల చేస్తాం..



ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన వెంటనే తదుపరి ప్రక్రియ పూర్తి చేసి విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నాం. సిబ్బందికి ఇప్పటికే ఈ మేరకు సూచించడం జరిగింది. కొత్త ప్రభుత్వం వచ్చిన విషయం తెలిసిందే. అందువల్ల రెండు ఫేజుల జాబితా మళ్లీ ప్రభుత్వానికి వెళ్లే అవకాశం ఉంది. ఏదేమైనా జీవో త్వరలోనే వస్తుందని ఆశిస్తున్నాం.

- రవికిరణ్,జైళ్ల శాఖ డీఐజీ, కోస్తాంధ్ర ప్రాంతం

చౌక ధరల దుకాణాల నోటిఫికేషన్‌కు సన్నాహాలు

- 133 రేషన్ డీలర్ల నియామకాలకు త్వరలో ప్రకటన
- ఎదురుచూస్తున్న ఔత్సాహికులకు శుభవార్త



కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 11: ప్రభుత్వ చౌక ధరల దుకాణాల నిర్వహణకు సంబంధించి నోటిఫికేషన్ ఇచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో ఎప్పటినుంచో ఖాళీగా ఉన్న దుకాణాలను ఔత్సాహికులకు అప్పగించేందుకు సిద్ధమవుతున్నారు. మొత్తంగా 1080 ప్రభుత్వ చౌకధరల దుకాణాలున్నాయి. కొంతకాలంగా 133 దుకాణాల నిర్వహణ ఖాళీగా ఉంది. కొంతమంది రేషన్‌డీలర్లు మృతి చెందడం, ఇంకొందరు దుకాణాలను స్వచ్ఛందంగా వదిలేయడం వంటి వివిధ కారణాలవల్ల రేషన్ దుకాణాల డీలర్ల పోస్టులు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలో 133 దుకాణాలను గత ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాల సభ్యులకు అప్పగించగా ఇప్పటి వరకు నిర్వహించారు. కొత్త ప్రభుత్వంలో వీటిని నింపేందుకు అధికారులు సిద్ధపడుతున్నారు. కాకినాడ జిల్లాలో 6,54,718 రేషన్ కార్డులున్నాయి. ప్రతినెలా 9వేల టన్నుల బియ్యాన్ని లబ్ధిదారులకు అందజేస్తున్నారు. 650 టన్నుల గోధుమపిండిని పంపిణీ చేస్తున్నారు. 21మండలాల్లో ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ జరుగుతోంది.

మండలాలవారీగా డీలర్ల ఖాళీల వివరాలు

జిల్లాలో మండలాలవారీగా ఖాళీల వివరాలను పరిశీలిస్తే పిఠాపురం 1, గొల్లప్రోలు 8, కరప 6, కాజులూరు 4, యు.కొత్తపల్లి 4, సామర్లకోట 13, కాకినాడ అర్బన్ 36, కాకినాడ రూరల్ 8, పెదపూడి 6, తాళ్లరేవు 14, జగ్గంపేట 1, రౌతులపూడి 3, ప్రత్తిపాడు 5, శంఖవరం 4, కోటనందూరు 1, పెద్దాపురం 7, కిర్లంపూడి 4, తుని 1, తొండంగి 1, గండేపల్లిలో 6 దుకాణాలను నిర్వహించేందుకు ఖాళీలున్నాయి.

ప్రజాపంపిణీ వ్యవస్థ గాడిలో పడేనా?

ఇప్పటివరకు ప్రభుత్వ చౌకదరల దుకాణాల్లో బియ్యం, గోధుమపిండి పంపిణీ చేస్తున్నారు. గత ఐదేళ్లలో అప్పుడప్పుడు మాత్రమే కందిపప్పు, పంచదార ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బియ్యంతోపాటు కొన్ని నిత్యావసర సరుకులు ఇస్తామని ప్రకటించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టి సమర్థవంతంగా నడిపిస్తామని వెల్లడించారు. సజ్జలు, రాగులు, జొన్నలు ఇస్తామని ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించారు. సెప్టెంబర్ నుంచి పంచదార కూడా పంపిణీ చేస్తామని సీఎం వెల్లడించారు. ఈ నేపథ్యంలో కూటమిప్రభుత్వంలో చౌకధరల దుకాణాల నిర్వహణ బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆర్డీవోల ఆధ్వర్యంలో..

కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌ల ఆర్డీవోలు నియామకాలపై నోటిఫికేషన్ ఇస్తారని జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్ తెలిపారు. త్వరలో నోటిఫికేషన్ ఇచ్చేందుకు అన్నీ సిద్ధం చేస్తున్నామన్నారు. నిర్దేశించిన విద్యార్హతలు, రోస్టర్ ప్రకారం నియామకాలు చేపడతారన్నారు.

14 ఎక్స్‌ప్రెస్ రైళ్ల పునరుద్ధరణ - 5లో

గంజాయితో నక్కి... పోలీసులకు చిక్కి - 5లో
» ఆరుగురి అరెస్టు » 7.6 కిలోల గంజాయి స్వాధీనం

నెల్లూరులో కేటుగాడు!
» సాంకేతిక సహాయంతో గుర్తించిన పోలీసులు
» బాలికలిద్దరూ సురక్షితం
» నేడు రాజమహేంద్రవరం తీసుకొచ్చే అవకాశం - 5లో

ముమ్మరంగా వరినాట్లు

» ఏలేరు, పీబీసీ ఆయకట్టు పరిధిలో 85శాతం నాట్లు పూర్తి

పిఠాపురం/గొల్లప్రోలు, ఆగస్టు 11: ఏలేరు, పీబీసీ ఆయకట్టులో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.ఇప్పటికే 85శాతం విస్తీర్ణంలో వరినాట్లు పూర్తికాగా మరో 10రోజుల్లో పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏలేరు, పీబీసీ కాలువల ద్వారా పుష్కలంగా సాగునీరు విడుదల కావడం, విస్తారంగా వర్షాలతో వ్యవసాయ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దమ్ములు పూర్తిచేసి వరినాట్లు వేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. సార్వా సీజన్ ప్రారంభంలో ఏలేరు, పీబీసీ ఆయకట్టుకు సాగునీటి విడుదలలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. ఆపై వర్షాలు సకాలంలో పడలేదు. ఏలేరు ఆయకట్టులో 60వేల ఎకరాలు, పీబీసీ పరిధిలో 42వేల ఎకరాల్లో వరిపంట సాగవుతోంది. పూర్తిస్థాయిలో పంటల సాగు సాధ్యమవుతుందా లేదా అనుకునే తరుణంలో పురుషోత్తపట్టణం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను ఏలేరు రిజర్వాయర్‌కు మళ్లించారు. దీంతో ఏలేరు ఆయకట్టుకు నీరు విడుదల ప్రారంభమైంది. పీబీసీ కాలువల్లో ఉన్న పూడికలు తీయడంతోపాటు నీటిపారుదలకు ఉన్న అడ్డంకులు తొలగించడంతో కాలువలకు నీరు విడుదల చేశారు. దీంతో రైతులు వరి నారుమడులు వేశారు. అదే సమయంలో వర్షాలు ప్రారంభమయ్యాయి. దీంతో రైతులు దమ్ములు పూర్తి చేసి వరినాట్లు వేస్తున్నారు. ఇప్పటికే 85శాతం వరి నాట్లు పూర్తయ్యాయి. గొల్లప్రోలు, చేబ్రోలు, సీతానగరం, లక్ష్మీపురం, మల్లవరం గ్రామాల్లో సుద్దగడ్డ వరదల కారణంగా వరిపొలాలు ముంపునకు గురయ్యాయి. 1500 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది.



ఏలేరు ఆయకట్టు పరిధిలోని గొల్లప్రోలులో వరినాట్లు వేస్తున్న కూలీలు

ఏడాది ఫీజు.. కట్టాల్సిందే?

» ఇంజనీరింగ్ విద్యార్థులపై కళాశాలల యాజమాన్యాల ఒత్తిడి
» ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ ఇస్తామన్నా వింత వైఖరి

జేఎన్టీయూకే, ఆగస్టు 11: గతంలో టీడీపీ హయాంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా సొమ్ములను సంబంధిత కళాశాలల ఖాతాకు జమచేసేవారు. తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని విద్యాదీవెనగా మార్చి విద్యార్థి ఖాతాకు వేస్తున్నామని చెప్పి బటన్ నొక్కినా సమయానికి సొమ్ములు పడిన దాఖలాలు లేవు. కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడితో తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కట్టేవారు. ఈ పరిస్థితుల్లో మార్పు తెస్తామని కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి సంబంధించిన సొమ్మును కళాశాలల ఖాతాలకే జమచేస్తామని హామీఇచ్చింది. అయినా సరే కొన్ని ఇంజనీరింగ్ కళాశాలలు ఫీజు విషయంలో పాత విధానాన్నే ప్రస్తుతం అనుసరిస్తున్నాయి. ముందుగానే ఏడాది ఫీజును చెల్లించాలంటూ కొన్ని ఇంజనీరింగ్ కళాశాలలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయి. ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ ఇస్తుంది కదా అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నా యాజమాన్యాలు వినడంలేదు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులతో అంటకాగిన కొన్ని కళాశాలల యాజమాన్యాలు నేటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదంటూ ప్రచారం చేసి విద్యార్థుల తల్లిదండ్రులనుంచి ముందుగానే ఏడాది ఫీజు వసూలు చేస్తున్నారు. దీనివల్ల నూతనంగా ఎన్నికైన కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఫీజు కట్టాలని ఒత్తిడి

కాకినాడ జేఎన్టీయూకే విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 29 ఇంజనీరింగ్ కళాశాలలుండగా వాటిలో 16,000 వరకూ వివిధ విభాగాల్లో సీట్లు ఉన్నాయి. రెండుదశల్లో నిర్వహించిన ఏపీఈఏపీసెట్ వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లను భర్తీచేశారు. గతనెల 22నుంచి ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు దీక్షారంభ్ తరగతులు నిర్వహిస్తున్నారు. కొన్ని కళాశాలలు బీటెక్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులను రిజిస్ట్రేషన్ ఫీజు కాకుండా ఏడాది ఫీజును కట్టాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.



47 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గురువులతో కలిసి గ్రూప్ ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

ఎన్నేళ్లో వేచిన ఉదయం

కిర్లంపూడి, ఆగస్టు 11: కాకినాడ జిల్లా కిర్లంపూడి కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1976-77 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుని ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఎవరెవరు ఏమి చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. దాదాపు 47 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఎంతో సంతోషంగా గడిపారు. కుటుంబసమేతంగా హాజరైన వారంతా వారి పిల్లలను ఒకరికొకరు పరిచయం చేసి సందడి చేశారు. రోజంతా తోటి మిత్రులతో ఆటపాటలతో ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు శాలువాలు కప్పి సత్కరించి వెండి ఆభరణాలు, జ్ఞాపికలు అందజేసి గౌరవించారు.



పది అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

ఒకే పోగుతో పది అడుగుల జాతీయ జెండా

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 11: ఒకే పోగుతో తయారు చేసిన పది అడుగుల జాతీయ జెండాను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ రాజమహేంద్రవరంలోని తన స్వగృహంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ జెండాను పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట వేమవరం గ్రామానికి చెందిన చేనేత కళాకారుడు రుద్రాక్షల సత్యనారాయణ తయారు చేశాడు. ఒకే పోగుతో జాతీయ జెండాను తయారు చేయడం ఉభయ గోదావరి జిల్లాల వాసులకు గర్వకారణమని దుర్గేష్ అన్నారు. రాకా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జీవీ రమణ, కోశాధికారి సూరపురెడ్డి తాతారావు పాల్గొన్నారు.

సాధారణ స్థాయికి గోదావరి ప్రవాహం

ధవళేశ్వరం, ఆగస్టు 11: గోదావరి ప్రవాహం క్రమంగా సాధారణ స్థాయికి చేరుకుంటోంది. ఆదివారం రాత్రి ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 7.10 అడుగులుగా నమోదు కాగా 4,08,157 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తున్నది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టాకు 2వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1500 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 2వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.



14 ఎక్స్‌ప్రెస్ రైళ్ల పునరుద్ధరణ

సామర్లకోట, ఆగస్టు 11: ఇటీవల పలు కారణాలతో, విజయవాడ రైల్వే కారిడార్ ఆధునికీకరణ పనులతో అటు విశాఖ వైపు, ఇటు విజయవాడ వైపు రద్దు చేసిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో 14 రైళ్ల రాకపోకలను పునరుద్ధరిస్తూ రైల్వే అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆదివారం రాత్రి సామర్లకోట రైల్వే స్టేషన్ ఉన్నతాధికారికి ఆదేశాలు అందాయి.

- విశాఖపట్టణం-కడప-విశాఖ మధ్య రాకపోకలు సాగించే 17488, 17487 నంబర్లు గల తిరుమల ఎక్స్‌ప్రెస్.
- విశాఖ-గుంటూరు-విశాఖ మధ్య రాకపోకలు సాగించే 22701, 22702 నంబర్లు గల ఉదయ్ ఎక్స్‌ప్రెస్.
- విజయవాడ-విశాఖపట్టణం-విజయవాడ మధ్య రాకపోకలు సాగించే 12718, 12717 నంబర్లు గల రత్నాచల్ ఎక్స్‌ప్రెస్.
- మచిలీపట్టణం-విశాఖపట్టణం-మచిలీపట్టణం మధ్య రాకపోకలు సాగించే 17219, 17220 నంబర్లు గల ఎక్స్‌ప్రెస్.
- గుంటూరు-విశాఖపట్టణం-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే 17239, 17240 నంబర్లు గల సింహాద్రి ఎక్స్‌ప్రెస్.
- తిరుపతి-విశాఖపట్టణం-తిరుపతి మధ్య రాకపోకలు సాగించే 22708, 22707 నంబర్లు గల డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్.
- రాజమహేంద్రవరం-విశాఖపట్టణం-రాజమహేంద్రవరం మధ్య రాకపోకలు సాగించే 07466, 07467 నంబర్లు గల మెమూ.
- గుంటూరు-రాయగడ-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే 17243, 17244 నంబర్లు గల రైళ్లు.
- విశాఖపట్టణం-ఎస్ఎంవీబీ బెంగళూరు-విశాఖపట్టణం మధ్య రాకపోకలు సాగించే 08543, 08544 నంబర్లు గల సూపర్‌ఫాస్ట్.

వీటన్నిటినీ ఈ నెల 18వ తేదీ నుంచి పునరుద్ధరిస్తారు. ఆయా ప్రదేశాలకు ప్రయాణించే ప్రయాణికులు సదరు రైళ్లల్లో రిజర్వేషన్ టిక్కెట్లు పొందేందుకు బుకింగ్ కౌంటర్ల వద్ద సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారి కోరారు.





జేసీ మాల్ ఫ్యాషన్ షోరూమ్‌ను ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటి శ్రీలీల, పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్. చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరంలో జేసీ మాల్ షోరూం

ప్రారంభించిన సినీ నటి శ్రీలీల, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 11: నగరంలోని ఏవీ అప్పారావు రోడ్డులో ఏర్పాటుచేసిన జేసీ మాల్ ఫ్యాషన్ షోరూమ్‌ను వర్ధమాన సినీ తార శ్రీలీల, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ప్రారంభించారు. వస్త్ర ప్రపంచంలో తలమానికంగా అలరారుతున్న ఇంత పెద్ద షాపింగ్ మాల్‌ను రాజమహేంద్రవరంలో ప్రారంభించిన జేసీ యాజమాన్యాన్ని మంత్రి దుర్గేష్‌తో పాటు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్‌పర్సన్ జమునారెడ్డి మాట్లాడుతూ తాము ఇప్పటికే తెలంగాణలో పలు ఫ్యాషన్ మాల్స్ ప్రారంభించామని, అవన్నీ కస్టమర్ల అభిమానాన్ని, ఆదరణను చూరగొన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా రాజమహేంద్రవరంలో ప్రారంభించామని చెప్పారు.

సినీ నటి శ్రీలీల మాట్లాడుతూ జేసీ మాల్ ఫ్యాషన్ షోరూంలను తెలంగాణలో చూశామన్నారు. ముచ్చటైన కలర్స్ మహిళలు మెచ్చే డిజైన్లతో అందరికీ అందుబాటులో ఉండే ధరలతో మంచి స్పందన వచ్చిందని, రాజమహేంద్రవరంలో షోరూమ్‌ను కూడా ఆదరించాలని కోరారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

గంజాయితో నక్కి... పోలీసులకు చిక్కి

- ఆరుగురి అరెస్టు
- 7.6 కిలోల గంజాయి స్వాధీనం
- రెండు మోటారు సైకిళ్లు సీజ్

కాకినాడ రూరల్, ఆగస్టు 11: కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ పర్యవేక్షణలో కాకినాడ రూరల్ సీఐ ఎన్‌డీ చైతన్యకృష్ణ, ఇంద్రపాలెం ఎస్ఐ వి.మణికుమార్ సిబ్బందితో కలిసి కాకినాడ రూరల్ మండలం చీడిగ ఫ్లై ఓవర్ సమీపంలో గల ఖాళీ స్థలంలో గంజాయి రవాణా, అమ్మకం జరుగుతోందన్న సమాచారంతో శనివారం మధ్యాహ్నం దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 7.6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని రెండు మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను కాకినాడ డీఎస్పీ కె.హనుమంతరావు వెల్లడించారు. కాకినాడ డివిజన్‌లో గంజాయి సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఏర్పాటుచేసిన ఒక బృందం గంజాయి రవాణా, అమ్మకాలపై పూర్తి నిఘా పెట్టిందన్నారు. ఇంద్రపాలెం పీఎస్‌లో కేసు నమోదు చేసి ఆ ఆరుగురిని రిమాండుకు పంపిస్తున్నామన్నారు. పాలెపు సతీష్‌పై కాకినాడ 1, 2 పోలీస్ స్టేషన్లలో ఆరు దొంగతనం కేసులు, రెండు గంజాయి కేసులు, కర్రి శామ్యూల్, మరువాడ శ్రీనివాస్, బోయి వెంకటరమణలపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో మర్డర్ కేసు వున్నాయి. మరో ఇద్దరు కలపరెడ్డి శివకుమార్, వీరిని ప్రభుతేజ అని డీఎస్పీ వివరించారు.

నెల్లూరులో కేటుగాడు!

- సాంకేతిక సహాయంతో గుర్తించిన పోలీసులు
- బాలికలిద్దరూ సురక్షితం
- నేడు రాజమహేంద్రవరం తీసుకొచ్చే అవకాశం



రాజమహేంద్రవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన ఇద్దరు బాలికలను ఓ యువకుడు ట్రాప్ చేసి తీసుకెళ్లడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. ఆ కేటుగాడిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారని, బాలికలు సురక్షితంగా ఉన్నారని తెలుస్తోంది. విజయ నగరం జిల్లా బత్తిరాజేరు మండలం పెదమన్నాపురానికి చెందిన మారోజు వెంకటేశ్ అదే ఊరికి చెందిన ఓ 17ఏళ్ల బాలికతో గత ఏడాది జూలైలో ఉడాయించాడు. దీనిపై అక్కడి పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఆ బాలికను వివిధ ప్రాంతాల్లో తిప్పుతూ ధవళేశ్వరం చేరుకున్నాడు. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కల్లబొల్లి మాటలు చెప్పి డబ్బులు లాగేసి ఆ ఊరి నుంచి మరో ఊరికి వెళ్లిపోవడం ఇతడికి అలవాటుగా మారింది. ఈ క్రమంలో ధవళేశ్వరంలో తాను ఉంటున్న ఇంటి పక్కన ఉన్న ఒక మహిళతో పరిచయం పెంచు కున్నాడు. బుద్ధిమంతుడిగా నటిస్తూ దగ్గరయ్యాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కొద్ది నెలల తర్వాత రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానని ఆమెను తీసుకొని విజయవాడ వెళ్లి ఓ చోట బస కల్పించాడు. ధవళేశ్వరం వచ్చి పిల్లాడిని తీసుకెళ్లి తల్లి వద్దకు చేర్చాడు. హాస్టల్‌లో దింపుతానని ఆ ఇద్దరు బాలికలకూ మాయమాటలు చెప్పి అతడి వెంట తీసుకెళ్లాడు. వాళ్లు హాస్టల్‌కి చేరకపోవడంతో తల్లి చేసిన ఫిర్యాదుతో గత నెల 30న ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే దర్యాప్తులో పురోగతి లేకపోవడంతో తల్లి రెండు రోజుల క్రితం కాకినాడ జిల్లా పిఠాపురం వెళ్లి టీడీపీ ఇన్‌చార్జి వర్మకు విన్నవించింది. ఆయన ఎస్పీతో మాట్లాడడంతో దర్యాప్తులో వేగం పెరిగింది. తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఎస్పీ కార్యాలయంలోని సైబర్ సెల్ నిరంతర పర్యవేక్షణ చేసింది. దీంతో రెండు రోజుల్లోనే కేసు ఓ కొలిక్కి వచ్చింది. సాంకేతికత సహాయంతో బాలికలతో ఆ నిందితుడు నెల్లూరులో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. వెంటనే అప్రమత్తమై వాళ్లు అక్కడి నుంచి మరోచోటికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్న అనంతరం వెంకటేశ్‌తో పాటు ఆ బాలికలను చాకచక్యంగా పట్టుకున్నారు. ముగ్గురినీ సోమవారం రాజమహేంద్రవరం తీసుకొచ్చే అవకాశం కనిపిస్తోంది. బాలికలను తీసుకెళ్లడంలో నిందితుడి ఉద్దేశ్యం వెల్లడి కావాల్సి ఉంది. కాగా మిస్సింగ్ కేసుల్లో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనడానికి ఈ కేసు తాజా ఉదాహరణనే ఆరోపణలు వినవస్తున్నాయి. పది రోజుల్లో సాధ్యం కాని పని ప్రజాప్రతినిధుల హెచ్చరికలతో కేవలం రెండు రోజుల్లో ఎలా సాధ్యమైందని కొందరు ప్రశ్నిస్తున్నారు.



దాతకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఈవో కిశోర్‌కుమార్

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, ఆగస్టు 11: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామికి వివిధ సేవల ద్వారా ఆదివారం ఒక్క రోజు ఆదాయం రూ.2,73,809 లభించింది. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి యానానికి చెందిన గుబ్బల పరంజ్యోతి-హిమపావని దంపతులు రూ.1.16 లక్షలు విరాళం సమర్పించారు. దాతలకు ఉప కమిషనరు, ఈవో భూపతి రాజు కిశోర్‌కుమార్ స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

నిత్యాన్నదానానికి రూ.50వేలు విరాళం

అంతర్వేది, ఆగస్టు 11: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని మలికిపురం భూపతివారిపేటకు చెందిన గుబ్బల శేఖర్ బాబు-యమున దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి రూ.50వేలు విరాళం అందించారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.



ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ అమ్మవారు

మరిడమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, ఆగస్టు 11: కాకినాడ జిల్లా పెద్దాపురంలో మరిడమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే అధిక సంఖ్యలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సహాయ కమిషనరు చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు.

గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి



తుని రూరల్/అన్నవరం, ఆగస్టు 11: తుని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నవరం రైల్వే స్టేషన్ 3వ నెంబరు ప్లాట్‌ఫామ్ శివారున గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనాస్థలాన్ని తుని రైల్వే పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదని, సంబంధీకులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ కోరారు.

ప్రైవేట్ విద్యా సంస్థల మనుగడకు

నిరంతర కృషి

యూపీఈఐఎఫ్ న్యాయ సలహాదారు శ్రీవిజయ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవిజయ్

కాకినాడ రూరల్, ఆగస్టు 11: ప్రైవేట్ విద్యా సంస్థల మనుగడ కోసం నిరంతరం కృషి చేస్తానని యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఫెడరేషన్ (యూపీఈఐఎఫ్) రాష్ట్ర న్యాయ సలహాదారు, హైకోర్టు న్యాయవాది ముతుకుమిల్లి శ్రీవిజయ్ పేర్కొన్నారు. కాకినాడ అశోక్‌నగర్‌లోని ఎం ఎస్ఎన్ పాఠశాల ఆవరణలో యూపీఈఐఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లతో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ దాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫెడరేషన్ ఎప్పటికప్పుడు ప్రైవేట్ విద్యా సంస్థల సమస్యలపై పోరాటం చేస్తోందని, పాఠశాలల యాజమాన్యాలు విద్యారంగంలో పలు మార్పులు తీసుకురావాలని సూచించారు. కార్యదర్శి ఎర్రంశెట్టి సురేష్ మాట్లాడుతూ సంఘం బలోపేతం కావాలంటే ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి మాట్లాడుతూ ప్రతి పాఠశాల కరస్పాండెంట్ ఉన్నతమైన విలువలతో హుందాగా వ్యవహరించాలని సూచించారు. విద్యారంగ సమస్యలపై శ్రీవిజయ్ చేస్తున్న పోరాటాన్ని అభినందించారు. అనంతరం పలు పాఠశాలల కరస్పాండెంట్లు లేవనెత్తిన సమస్యలకు పరిష్కార మార్గాలు సూచించారు. సమావేశంలో ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ ఎస్.పూర్ణచంద్రరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు



తలుపులమ్మ అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

'లోవ'లో శ్రావణ శోభ

తుని రూరల్, ఆగస్టు 11: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం ఆదివారం శ్రావణ శోభ సంతరించుకుంది. పెద్ద ఎత్తున మహిళలు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. 15వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథరాజు తెలిపారు. దర్శనాంతరం ఆలయ ప్రాంగణంలో వంటా-వార్పుచేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం రూ.4.67 లక్షల ఆదాయం వచ్చింది.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి గుర్తింపు

కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబీకులకు అప్పగింత

అన్నవరం, ఆగస్టు 11: కాకినాడ జిల్లా అన్నవరం రైల్వే స్టేషన్‌లో ఒక బ్యాగ్‌తో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని చూసి ప్రయాణికులు జీఆర్పీ హెచ్‌సీ శ్యామ్‌కు సమాచారమిచ్చారు. ఆయన హుటాహుటిన స్టేషన్‌కు వచ్చి సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. తన పేరు గాజుల స్వామి అని, పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి స్వగ్రామం అని, దగ్గర్లో ఉన్న రెస్టారెంట్‌లో పనిచేయమని తల్లిదండ్రులు అడిగితే ఇష్టంలేక బట్టలు సర్దుకుని వచ్చేశానని చెప్పాడు. అతడికి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబీకులకు అప్పగించినట్టు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ చెప్పారు.



గోవమ్మతల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లరేవు, ఆగస్టు 11: గాడిమొగ పంచాయతీ బాబానగర్‌లో కొలువై ఉన్న గోవమ్మతల్లికి అర్చకులు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులు గణపతి పూజ, అభిషేకం, కుంకుమ పూజలను ఆదివారం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కులను చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ కావూరి సూర్యకాంతం, ఆలయ కమిటీ సభ్యులు సంగాడి కామేశ్వరరావు, చింతా లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు గౌరవం కల్పించిన కూటమి ప్రభుత్వం

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి

సామర్లకోట, ఆగస్టు 11: రాష్ట్రంలో ప్రతీ గ్రామ పంచాయతీలోనూ సర్పంచ్‌ల చేతుల మీదుగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకావిష్కరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడమే గాక ఈ వేడుకలకు నిధులు పెంచుతూ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయంపై టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్ర మౌళి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం సామర్లకోటలో విలేకరులతో గుణ్ణం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతీ సర్పంచ్ తలెత్తుకుని తిరిగేలా గౌరవం కల్పించిందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గతంలో ప్రభుత్వాలు చిన్న పంచాయతీలకు రూ.100, పెద్ద పంచాయతీలకు రూ.250 మాత్రమే ఇచ్చేవారని.. తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మైనర్ పంచాయతీలకు రూ.10వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25వేలు చొప్పున నిధులు మంజూరుచేసిందని తెలిపారు. గ్రామ పంచాయతీలు గత పాలకుల వైఖరితో నిర్వీర్యం అవుతున్నాయన్న తరుణంలో వాటికి తిరిగి జవసత్వాలు కల్పించడంతో గ్రామ స్వరాజ్యానికి మంచిరోజులు వచ్చాయన్నారు.

'గణేష్ ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 11: గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, పర్యావరణానికి హాని తలపెట్టని మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని కాకినాడ నగర గణేష్ ఉత్సవ కమిటీ ఉత్సవ కమిటీ కో కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, సమితి కన్వీనర్ వై.మాలకొండయ్య, సమితి గౌరవాధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు కోరారు. ఆదివారం వలసపాకల గంగరాజునగర్ 3వ వీధిలో నగర ఉత్సవ కమిటీ పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గణేష్ ఉత్సవాల నిర్వహణ పట్ల ఆంక్షలతో ఇబ్బందులకు గురి చేశారన్నారు. కార్పొరేషన్, పోర్టు, మత్స్యశాఖ, ట్రాన్స్ కో, వైద్య, ఎక్సైజ్, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు, రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేలా సహకరించాలని కోరారు. సమావేశంలో బొలిశెట్టి వెంకట రామకృష్ణ, పి.సత్యనారాయణ, దిలీప్‌కుమార్, సదనాని, గోడి వెంకట్, కవికొండల చలపతి, కండిల్లి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త నానికి అభినందన



నానిని సన్మానిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు, ఆగస్టు 11: నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 702 జనసేన క్రియా శీలక సభ్యత్వాలు చేసిన పార్టీ కార్యకర్త గల్లా నానిని ఆదివారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, జిల్లా సంయుక్త కార్యదర్శి జిల్లా నాయకులు దాసం శేషారావు, పెంటకోట మోహన్ అభినందించారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో కన్నా ధర్మవరంలో పార్టీ క్రియాశీలక సభ్యత్వాల నమోదు ప్రథమస్థాయిలో జరగడం ప్రసంశనీయమని తమ్మయ్యబాబు, శేషారావు, మోహన్ అభినం దించారు. ధర్మవరంలో ఆదివారం నాటికి 702 క్రియాశీలక సభ్యత్వాలు పూర్తిచేసిన నానిని ప్రత్యేకంగా శాలువా కప్పి పూలమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దాసం లోవరాజు, దాడి గోపి, సిద్ధపు రెడ్డి గణేష్, అమరాది రఘు ఉన్నారు.

పెద్దాపురం తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహశీల్దార్‌కు సిబ్బంది స్వాగతం

పెద్దాపురం, ఆగస్టు 11: పెద్దాపురం తహశీల్దార్‌గా సీహెచ్.వెంకటలక్ష్మి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా మొవ్వలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ తహశీల్దార్‌గా పనిచేసిన ఎస్.శ్రీనివాసరెడ్డి కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమెకు కార్యాలయ డీటీ టి.కాంతారావు, రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

సామర్లకోట డిప్యూటీ తహశీల్దార్‌కు పదోన్నతి

సామర్లకోట, ఆగస్టు 11: సామర్లకోట మండల డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఆర్.శ్రీనివాస్ పదోన్నతిపై గండేపల్లి మండల తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు. శ్రీనివాస్ గతంలో సామర్లకోట మండలంలోనే సీనియర్ అసిస్టెంట్, ఆర్ఐ, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేశారు. సీనియారిటీ దృష్ట్యా తహశీల్దార్‌గా పదోన్నతి కల్పిస్తూ గండేపల్లి మండలానికి బదిలీచేయగా సోమవారం గండేపల్లిలో విధుల్లో చేరనున్నారు.

'సేవా కార్యక్రమాల నిర్వహణలో ముందుంటాం'

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 11: సేవా కార్యక్రమాల నిర్వహణలో ఎల్లప్పుడు ముందుంటామని శ్రీమ్ అపర్ణా సేవా ట్రస్టు ఛైర్మన్ ఆకొండి వెంకటేశ్వరశర్మ తెలిపారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో ఆదివారం పాలిటెక్నిక్ విద్యార్థిని రాయవరపు అనుగ్ర చదువు ఖర్చుల నిమిత్తం రూ.8,500, ఉన్నత పాఠశాల విద్యార్థిని కాదా అపర్ణ కంటి వైద్య ఖర్చులు నిమిత్తం రూ.4,200ను ఆయన అందజేశారు. భవిష్యత్తులోనూ వీరికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించి గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. హోమియో వైద్యులు డాక్టర్ సూర్యపవన్‌రామ్, డాక్టర్ నాగమనోజ్ఞ,బత్తుల వీరభద్రం పాల్గొన్నారు.

ఉచితంగా నేత్ర పరీక్షలు

ఏలేశ్వరం, ఆగస్టు 11: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ సచివాలయంలో ఆదివారం రాజమహేంద్రవరం, జగ్గంపేటకు చెందిన గౌతమి, శ్రీచరణ్ కంటి ఆసుపత్రి బృందాలు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని కౌన్సిలర్ అలమండ చలమయ్య, మాజీ కౌన్సిలర్ బూర్లు సత్తిబాబు ప్రారంభించారు. వైద్యులు జయరావు, ఉమా మహేశ్వరావు, అనిల్‌బాబు, మహేశ్వరావులు సుమారు 85మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. వీరిలో 15మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. 35 మందిని ఆపరేషన్ నిమిత్తం రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయానికి తరలించామన్నారు. కార్యక్రమంలో అలమండ దుర్గాప్రసాద్, ఉడతల రమణారావు పాల్గొన్నారు.

తేటగుంటలో నేత్ర వైద్య శిబిరం

తుని రూరల్, ఆగస్టు 11: తేటగుంట గ్రామంలో ఆదివారం గ్రామపెద్దలు, కూటమి నాయకులు యువత ఆధ్వర్యంలో చేపట్టిన నేత్ర వైద్య శిబిరాన్ని మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు గజ్జి అప్పలరాజు ప్రారంభించారు. పాయకరావుపేటకు చెందిన హైమా కంటి ఆసుపత్రి వైద్యులు ప్రసాద్ నేత్ర పరీక్షలు నిర్వహించారు. 100మందికి పైగా పరీక్షలు నిర్వహించి పలువురికి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో గజ్జి రాంబాబు, మర్రి వీరబాబు, నిమ్మల లోవసూరిబాబు, శివ, కొల్లు సత్యనారాయణ, పి.కృష్ణ సేవలు అందించారు.

ఆర్యవైశ్య భక్త సమాజం అధ్యక్షుడిగా దంగేటి

పిఠాపురం, ఆగస్టు 11: వాసవి కన్యకాపరమేశ్వరీ ఆర్యవైశ్య భక్త సమాజం అధ్యక్షుడిగా దంగేటి సత్యనారాయణ(సత్తిపండు) ఎన్నికయ్యారు. పిఠాపురం పట్టణంలోని కోటగుమ్మం సెంటర్ వద్ద గల కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆదివారం భక్త సమాజం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శిగా కంచర్ల నగేష్ గుప్తా, కోశాధికారిగా కర్నాటకపు తాతాజీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసాలు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 11: పెద్దాపురం రామారావుపేట, కాకినాడ సురేష్‌నగర్‌లకు చెందిన శ్రీ ప్రకాశ్ సినర్జీ స్కూల్స్‌కు చెందిన విద్యార్థుల ఆధ్వర్యంలో సాహసం చేయరా డింభకా ఫ్లాష్ మాబ్ కార్యక్రమం ఆదివారం కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో ఎస్ఆర్ఎంటీ షాపింగ్ మాల్లో ఘనంగా నిర్వహించారు. కేరళ యుద్ధ క్రీడ అయిన కలరిపయట్టు, రోప్ స్కిప్పింగ్ యుద్ధ క్రీడల ప్రదర్శనలో విద్యార్థులు ప్రదర్శించిన సాహస విన్యాసాలు సందర్శకులకు కనువిందు చేశాయి. శ్రీప్రకాశ్ సినర్జీ స్కూల్ డైరెక్టర్ సీహెచ్ విజయ్ ప్రకాశ్ మాట్లాడుతూ కేరళలో ప్రసిద్ధికాంచిన యుద్ధక్రీడ కలరిప్పయ్యటు అని, ప్రాచీన కాలంలో ప్రసిద్ధి పొందినప్పటికీ ప్రస్తుత తరుణంలో ఆదరణ తగ్గిందన్నారు. ఈ క్రీడను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో కేరళకు చెందిన కృష్ణదాస్ గురుకుల్, 9వ తరగతి విద్యార్థి కావ్యల ఆధ్వర్యంలో విద్యార్థులకు గత 45 రోజులుగా ఈ యుద్ధక్రీడపై శిక్షణ ఇప్పించడం జరిగిందన్నారు. ముఖ్యంగా బాలికలు ఈ యుద్ధ విద్యను నేర్చుకోవడం ద్వారా ఆత్మరక్షణకు ఎంతోదోహదం చేస్తుందన్నారు.



కాకినాడలో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

అసౌకర్యాల చెరలో టిడ్కో ఇళ్లు!

- ఏడాదిలోనే పైప్‌లైన్ల లీకేజీలు
- కూరుకుపోయిన సీసీ డ్రెయిన్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



డబుల్ బెడ్ రూమ్ ప్లాట్ల వద్ద మట్టి రోడ్డు, వర్షాలకు కూరుకుపోయిన సీసీ డ్రెయిన్ బాడీ వాల్స్

కాకినాడ సిటీ, ఆగస్టు 11: కాకినాడ పర్లోవపేటలో నిర్మించిన టిడ్కో ఇళ్ల(డబుల్ బెడ్ రూమ్ ప్లాట్లు) అసౌకర్యాల చెరలో మగ్గుతున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్ని సౌకర్యాలతో నిర్మించిన టిడ్కో ఇళ్లు ఆ తర్వాత వైసీపీ హయాంలో మూలనపడ్డాయి. ఎట్టకేలకు ఏడాది క్రితం ఈ ప్లాట్లను లబ్ధిదారులకు అప్పగించారు. ఈ ప్లాట్లలో ఎటువంటి సౌకర్యాలు లేక లబ్ధిదారులు చాలా కాలం ఇళ్లలోకి దిగలేదు. తీరా ఇళ్లలోకి దిగాక ఇంటర్నల్ రోడ్లు, డ్రెయిన్ నిర్మించకపోడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్ల బయట నుంచి నిర్మించిన వెడల్పు లేని సీసీ డ్రెయిన్ బాడీవాల్స్ ఇటీవల కురిసిన వర్షాలకు కూరుకుపోయాయి. ఈ ప్లాట్ల సముదాయం వెలువడే వాడకం నీరు ఉప్పుటేరు కాలువలో కలిసే అవుట్‌లెట్ డ్రెయిన్ కేవలం అడుగు వెడల్పుతో సీసీ డ్రెయిన్ నిర్మించడం, అది కూడా కూరుకుపోవడం, ప్లాట్ల పైప్‌లైన్లు లీకేజీల్లో గోడల వెంట మురుగునీరు పారడం ఇక్కడి నాసిరకం పనులకు అద్దంపడుతున్నాయి. బాత్‌రూమ్‌ల్లో గ్రౌడింగ్ సరిగా చేయక ఎక్కడికక్కడ లీకేజీలు ఏర్పడుతున్నాయి. సెప్టిక్ ట్యాంక్‌ల నుంచే వెలువడే సీవేజ్ వాటర్ సంప్‌కు చేరే అండర్ గ్రౌండ్ పైప్‌లైన్లు దెబ్బతిన్నాయి. టిడ్కోతో ఒప్పందం ప్రకారం ఈ ప్లాట్ల మరమ్మతులు, ఇతరత్రా ఏడాది పాటు కాంట్రాక్ట్ సంస్థ నిర్వహణ చేయాల్సిఉంది. 36 బ్లాక్‌లు, బ్లాక్‌కు 32 ప్లాట్లతో 1152 ప్లాట్ల సముదాయంతో గల ఈ డబుల్ బెడ్ రూమ్ ప్లాట్లను సమీప డివిజన్‌లో కలపక పోవడం వల్ల ప్రజలకు కార్పొరేషన్ ద్వారా సౌకర్యాలు అందడం లేదు. ఈ సముదాయాన్ని సమీప డివిజన్‌లో కలిపి కనీస సదుపాయాలు కల్పించాలని ప్లాట్లవాసులు కోరుతున్నారు.



టిడ్కో ఇళ్ల వద్ద వెడల్పు లేని సీసీ డ్రెయిన్

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తాం

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుబ్బల రాజు



పిఠాపురంలో నివాళులర్పిస్తున్న నాయకులు

పిఠాపురం, ఆగస్టు 11: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తామని ఆంధ్రప్రదేశ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుబ్బల రాజు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ జరపరాదంటూ 1997లో నిర్వహించిన ఛలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొని ప్రాణాలు కోల్పోయిన మాలమృతవీరులు పాణంగి శేషయ్య, ఓవుతోట నారాయణ సంస్మరణ సభను పట్టణంలోని మాలమహానాడు కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పీవీరావు, శేషయ్య, నారాయణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. వారి స్ఫూర్తితో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గుబ్బల రాజు, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా వెంకట్రావు, ఎడ్ల లక్ష్మీపతి, ములగపాటి బుచ్చిరాజు, దడాల సత్తిబాబు, దుర్గాడ సింహాచలం,బందిలి సూరిబాబు, దడాల చిన్నబాబు పాల్గొన్నారు. పట్టణంలోని రథాలపేట అంబేద్కర్ సెంటర్‌లో మాలమృతవీరులకు పీవీరావు మాలమహానాడు నాయకులు నివాళులర్పించారు. మాలమహానాడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ అధ్యక్షుడు బత్తిన శామ్యూల్, పట్టణ అధ్యక్షుడు వేళంగి వెంకటేష్, పెదపాటి రాజేష్, గుర్రాల ఏసురత్నం, మాతా నాగేశ్వరరావు, సాకా వినయ్ పాల్గొన్నారు.


మోదీ, చంద్రబాబు, మందకృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం



గజ్జనపూడిలో పాలాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు, ఆగస్టు 11: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని గజ్జనపూడి గ్రామంలో ఆదివారం రాత్రి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు మాదిగ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. గజ్జనపూడి అరుంధతి యూత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అరుంధతి వాడ వద్ద దివంగత ఉప ప్రధాని జగ్జీవన్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పు వెలువడడం అరుంధతీలకు ఎంతో ప్రయోజనకరమని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో ధర్మవరం మాజీ సర్పంచ్ కాపారపు రాజబాబు, సీనియర్ న్యాయవాది పిల్ల బలరాముడు, పలివెల సతీష్, బీజేపీ నాయకులు సింగిలిదేవ్ సత్తిరాజు, ఊటా వీరబాబు, గజ్జనపూడి, ఒమ్మంగి గ్రామపెద్దలు పలివెల ఏకాబు, వల్లూరి రత్నం పాల్గొన్నారు.

కీర్తి మెడికల్ స్టోర్ ప్రారంభం



స్టోర్‌ని ప్రారంభిస్తున్న డాక్టర్ కవిత

సర్పవరం జంక్షన్, ఆగస్టు 11: కాకినాడ మెయిన్‌రోడ్డులో గల అయ్యప్ప టవర్-9 లో ఆదివారం కీర్తి మెడికల్ స్టోర్ ఛైర్మన్ లోకిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో 23వ బ్రాంచ్‌ను జేఎన్‌టీయూకే వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, గుంటూరుకు చెందిన జననీ గ్యాస్ట్రో ఎంట్రాలజీ హాస్పిటల్స్ డాక్టర్ ముక్కు కవిత ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అన్ని రకాల కంపెనీల నాణ్యమైన మందులు, సరసమైన ధరలకు అందించేలా ఏర్పాట్లు చేసిన కీర్తిమెడికల్ నిర్వాహకులను అభినందించారు. ఏపీ, తెలంగాణతో పాటూ 4 రాష్ట్రాల్లో 22 బ్రాంచ్‌లు ఉన్నాయని, కొత్తగా 23వ బ్రాంచి కాకినాడలో ప్రారంభించడం ఆనందంగా ఉందని కీర్తి మెడికల్స్ స్టోర్ ఛైర్మన్ డాక్టర్ లోకిరెడ్డి తిరుపతి రెడ్డి అన్నారు. 30 వేల రకాల మందులు అందుబాటులో ఉంచామని, 24 గంటల సర్వీసు, ఉచిత హోమ్‌డెలివరీ చేస్తామన్నారు. డాక్టర్ కిరణ్, డాక్టర్ సున్న ఆదిత్యసత్య ప్రసన్, సంస్థ డైరెక్టర్ బి నాగరాజు, జనరల్ మేనేజర్ పి.జనార్దన్ నాయుడు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి సేవా అవార్డు

ప్రత్తిపాడు, ఆగస్టు 11: ప్రత్తిపాడు టీడీపీ నాయకుడు, నాయి బ్రాహ్మణ సంఘ ఉపాధ్యక్షుడు నెల్లిపాక నాగ సత్యనారాయణకు విశాఖపట్నంలో ఆదివారం నిర్వాహకులు ఎన్టీఆర్ సేవా అవార్డును అందజేశారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, మాజీ సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు, సీబీఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్ అభినందించారు.

ప్రతీ ఇంటిపై జాతీయ పతాకం ఆవిష్కరించాలి

- పిలుపునిచ్చిన బీజేపీ నాయకులు
- పలుచోట్ల హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు



సర్పవరంజంక్షన్: ర్యాలీని ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్

సర్పవరం జంక్షన్, ఆగస్టు 11: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతీ ఇంటిపై జాతీయ పతాకం ఆవిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, పార్లమెంటరీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు కోరారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆదివారం భారతీయ యువమోర్చా ఆధ్వర్యంలో అచ్చంపేట సెంటర్ నుంచి బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో త్యాగమూర్తులు ప్రాణ త్యాగం చేశారని, వీరి పోరాట స్ఫూర్తిని స్మరించుకోవాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. మహనీయుల త్యాగాలను భావి పౌరులకు చాటిచెప్పేలా ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు కాకినాడ జిల్లాలో తిరంగా యాత్ర ప్రారంభించామన్నారు. ప్రతీ గ్రామం, మండలంలో తిరంగా ర్యాలీతో పాటూ తమ ఇంటిపై జాతీయజెండా ఆవిష్కరించి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. బైక్ ర్యాలీ సర్పవరం జంక్షన్, నాగమల్లి తోట జంక్షన్, భానుగుడి, మసీద్‌సెంటర్, జగన్నాథపురం, వారపుసంతరోడ్డు, జడ్పీ సెంటర్, బాలాజీసెంటర్ మీదుగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చిత్ర పాపారావు, అనపర్తి వెంకటేష్, సలాది అనిల్‌కుమార్, లక్ష్మీప్రసన్న, పితాని లీలావతి, నందూరి సత్తిబాబు ఉన్నారు.

గొల్లప్రోలు: ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. గొల్లప్రోలులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ పిలుపుమేరకు ఈనెల 13,14,15న రోజూ ప్రతి ఇంటిపై జాతీయజెండాను ఎగురవేయాలన్నారు. జెండాను గౌరవప్రదంగా చూడాలని, ఆగస్టు 15న జెండా వందనంలో అందరూ పాల్గొనాలని వారు కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్టా మధు, ఉలవశెట్టి శ్రీను, కర్రి సత్యనారాయణ, మలిరెడ్డి నారాయణరావు, మేడసాని కామరాజు, చీపూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 15న ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు తుమ్మల పద్మజ పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావువారి చంద్రంపాలెంలో బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. పద్మజ ప్రతీ ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలన్నారు. రాష్ట్ర నాయకులు కరెడ్ల దేవి, బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి విత్తనాల వెంకటరమణ, తలాటం గంగబాబు, పోతుల వీరప్రభాకర్, ఏడుకొండలు పాల్గొన్నారు.

యువత చైతన్యంతోనే సమాజంలో మార్పు

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 11: యువత చైతన్యంతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో నూతనంగా ఏర్పాటైన యువత సేవా సంఘాన్ని ప్రారంభించి, లోగోను ఆవిష్కరించారు. అనంతరం అభయ బ్లడ్‌బ్యాంకు సౌజన్యంతో సంఘం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన యువతీ యువకులను అభినందించారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. సంఘం చేపట్టే కార్యక్రమాలకు పూర్తి సహకారం అందజేస్తానన్నారు.



రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న వర్మ

కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉలవకాయల దేవేంద్రుడు, మల్లిపూడి వీరబాబు, దూళ్ల లచ్చబాబు, యాదాల రామకృష్ణ, పెండ్యాల అమ్మన్న, కొల్లు బాబూరావు, బత్తుల శ్రీను, శీరం రమణ, అల్లం దొరబాబు, ఓరుగంటి పెదకాపు, దమ్ము చిన్న పాల్గొన్నారు.

6 అర్బన్ ప్రాంతాల విలీనాన్ని పూర్తి చేయాలి

సీపీఎం జిల్లా కన్వీనర్ మోర్తా రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 11: 13ఏళ్లుగా పాలకవర్గాలు లేని తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వలసపాకల, వాకలపూడి, రమణయ్యపేట అర్బన్ ప్రాంతాలను కాకినాడ కార్పొరేషన్‌లో వెంటనే విలీనం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కన్వీనర్ మోర్తా రాజశేఖర్ డిమాండ్ చేశారు. సీపీఎం సెంటర్ శాఖ సమావేశం ఆదివారం కె.సింహాచలం అధ్యక్షతన సుందరయ్య భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కన్వీనర్ మోర్తా రాజశేఖర్ మాట్లాడుతూ 13ఏళ్లుగా ఆరు ప్రాంతాల్లో పాలకవర్గాలు లేకపోవడం వల్ల ఈ గ్రామాల్లో మంచినీరు, డ్రైనేజీ, సామాజిక స్థలాల పరిరక్షణ లాంటి అనేక సమస్యలు పేరుకుపోయాయన్నారు. ఇన్‌చార్జి అధికారుల పాలన వల్ల ఈ గ్రామాల్లో అవినీతి విపరీతంగా పెరిగిందన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టి పెట్టి విలీన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో సీహెచ్ అజయ్‌కుమార్, కె.వీరబాబు, సీరమణి పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడవద్దు



కిర్లంపూడి: భూములను పరిశీలిస్తున్న రమేష్

కిర్లంపూడి, ఆగస్టు 11: రైతులు అధైర్యపడవద్దు, అధికారులతో మాట్లాడి సమస్య శాశ్వత పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ భరోసా ఇచ్చారు. మండలంలోని గోనేడ నుంచి జగ్గంపేట మండలం రామవరం వెళ్లే దారిలో కండి కాలువ అనుకుని ఉన్న భూములు నీటమునగడంతో ఆదివారం తుమ్మలపల్లి పరిశీలించారు. దుస్లాం, పోలవరం కాలువల నుంచి నీరు ఎక్కువగా కండికాలువ వైపు రావడంతో దుస్లాం కాలువను ఆనుకుని ఉన్న 400 ఎకరాలు పొలాలు ప్రతీ ఏటా నీట మునుగుతున్నాయని స్థానిక రైతులు రమేష్‌కు తెలిపారు. దీనిపై రమేష్ మాట్లాడుతూ అధికారులతో మాట్లాడతానని తెలిపారు.

జనసేనలో చేరిక

జగ్గంపేట, ఆగస్టు 11: గోకవరం మండలం కామరాజుపేటలో కొమ్మూరు ప్రసాద్, మిట్టపల్లి వరప్రసాద్, మేడిశెట్టి జానకిరామ్, చర్మకార్మికుల వారి అనుచరులు 100 మంది జనసేన పార్టీ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. జగ్గంపేటలో మార్వాడీలు కాశీ కావిడి యాత్ర నిర్వహించగా ప్రారంభ కార్యక్రమంలో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయరెడ్డికి ఐకాన్ అవార్డు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 11: వేసవితో పాటూ నిత్యం ప్రయాణికుల దాహార్తిని తీరుస్తూ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రమణయ్యపేటకు చెందిన అనపాల ఆంజనేయరెడ్డికి ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డు బహూకరించారు. రాజమహేంద్రవరంలో ఫిలంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఫౌండర్ డాక్టర్ అద్దంకి రాజు ఆధ్వర్యంలో ఆంజనేయరెడ్డికి ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డును బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు నరసిపల్లి హారిక, అంతర్జాతీయ శ్రీకళావేదిక ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌లు అందజేసి సత్కరించారు.

మళ్లీ పెరుగుతున్న సుద్దగడ్డ వరద



వరద నీటిలో వెళ్తున్న జగనన్న కాలనీవాసులు

గొల్లప్రోలు, ఆగస్టు 11: తగ్గుముఖం పట్టిన సుద్దగడ్డ వరద ఆదివారం మళ్లీ పెరిగింది. వారం రోజులుగా సుద్దగడ్డ వరద ఉధృతితో గొల్లప్రోలు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. శనివారం రాత్రి వరకూ తగ్గుతూ వచ్చిన వరద ఆదివారం ఉదయం నుంచి మళ్లీ పెరగడం ప్రారంభమయింది. గొల్లప్రోలు పట్టణ శివారులోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపై వరద నీరు ప్రవహిస్తున్నది. వరద నీటిలోనే కాలనీవాసులు రాకపోకలు సాగిస్తున్నారు. గొల్లప్రోలు బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఇంకా వరద ముంపు కొనసాగుతున్నది.

వెండి ఊయల బహూకరణ



వెండి ఊయలను బహూకరిస్తున్న దాతలు

తాళ్లరేవు, ఆగస్టు 11: పి.మల్లవరం గ్రామదేవత ముత్యాలమ్మతల్లికి యానాం వాసులు సలాది జానకిరామ్, వెంకటరమణ దంపతులు 4 కిలోలు వెండితో చేయించిన రూ.4.50లక్షలు విలువచేసే వెండిఊయలను ఆదివారం బహూకరించారు. దాతల కుమారుడు రెయాన్ష్‌తేజ్ పుట్టినరోజున వెండిఊయల చేయించి ఇస్తామని మొక్కుకున్నారు. పంపన విష్ణుమూర్తి, వెంకటలక్ష్మి దంపతులు పీఠలపై కూర్చుని పూజలు చేశారు. దాతలకు ఆలయకమిటీ తీర్థప్రసాదాలందజేశారు.

పైడితల్లి విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

ప్రత్తిపాడు, ఆగస్టు 11: మండలంలోని పెద్దిపాలెంలో ఆదివారం పైడితల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరాగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రీసు సత్యనారాయణ, రాళ్ల సీతారాం, రీసు నాగరాజు, కందిపల్లి రాజు, పితాని పెద్ద, చంటి, బొందలపురాజు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

కిర్లంపూడి, ఆగస్టు 11: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బడే రాజేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వతేదీ వరకు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12 నుంచి 14 వరకు నిర్వహించే రీ ఫ్రెషర్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈవోపీఆర్డీ కాశీ విశ్వనాథ్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఈ శిక్షణాతరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 11: ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10.30గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. కాకినాడ శారదాదేవి ఆలయం సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, 08842357800కు సమస్యలు తెలియజేయవచ్చని తెలిపారు.

గ్రంథాలయానికి కుర్చీలు బహూకరణ

పెద్దాపురం, ఆగస్టు 11: స్థానిక ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయానికి పట్టణానికి చెందిన జిగిని రాజేష్ కన్నా కుటుంబసభ్యులు 15 కుర్చీలు బహూకరించినట్టు గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళి కుటుంబానికి సాయం

తాళ్లరేవు, ఆగస్టు 11: పాతకోరింగ టీడీపీనేత వెంటపల్లి వీరవెంకట చంద్రమౌళి ఇటీవల అకాలంగా మృతిచెందగా ఆయన భార్య, ఇద్దరు ఆడపిల్లలు అనాథగా మిగిలారు. వారికి సుంకరపాలెం టీడీపీనేత, మాజీ సర్పంచ్ మోహరి శ్రీనివాస కిరణ్ రూ.5000 చెక్కును ఆర్థికసాయంగా అందించారు.